



'టన్!'

ఇది ఒకటి.

'టన్— టన్'

ఇవి రెండు.

ఈ ఒకటీ— రెండూల మధ్యనే నా జీవితం సాగిపోతూ ఉంది. సుషుప్తా? కాదు. జాగ్రదవస్థా? కాదు. స్వప్నావస్థా? కాదు. కానీ, నా జీవితం ఇలాగే గడిచిపోతుందా? ఇంకో అనుమానావస్థలో జీవితాన్ని కొనసాగించాలని, అదృష్టానికి ఎదురు తిరగాలని ఆశించాను. పైవాడి దయ ఎలాగుఉందో? దినదినగండం నూరేళ్ళాయుస్సు అన్నట్లు ప్రాణాలను గుప్పిట్లో పెట్టుకుని నడపాలి. నా చేతిలో కొన్ని పాతికలమంది ప్రాణాలుంటాయి. వాళ్ళను నేను చూడను. కానీ వారు నన్ను చూస్తారు. నా డ్రైవింగును మెచ్చుకుంటారు. ఎంత జోరుగా వెళ్ళితే అంత మంచి డ్రైవరని వారి భావన. అందులోనూ పిరికివారు, ప్రాణాన్ని అతి ప్రేమగా చూచుకొనే వారు మాత్రం నా డ్రైవింగును తిట్టుకుంటారు. సాధారణంగా నూటికి తొంభై తొమ్మిది మంది తమప్రాణాన్ని అతి తీయగా ప్రేమించుకుంటారు.

అర్జంటు పనులు ఉన్నవారు మాత్రం తొందరగా తీసుకుని వెళ్ళితే మెచ్చుకొంటారు.

వారి మెచ్చుకోలు ఎవరిక్కావాలి?

నా కుటుంబంలో నన్ను ఎవరూ మెచ్చుకోరే? ఎవరూ ఆదరించరే? అది నా 'ఖర్మ' అనుకున్నా నా మనసు ఒప్పుకోవడం లేదెందుకో! 'ప్రపంచంలో నీకంటె ఎందరో కనిష్ఠులున్నారు. ఇంతకే నీవు తృప్తిచెందు' అని నా మనసుకు నేనే నచ్చ జెప్పుకుంటాను. ఇందులో నాస్వార్థం ఉండవచ్చు. కానీ, ఆత్మ సంతృప్తికై స్వార్థాన్ని కొనుక్కున్నాను......

నన్ను నవమాసాలు తన కడుపులో దాపెట్టుకొని మోసేటప్పుడు అమ్మ నన్ను గురించి ఏమని అనుకునిఉంటుంది? 'నాకు పుట్టబోయే కుమారుడు (అవును. కుమార్తె కాకూడదు.) మంచివాడై ఉండాలి. వాడు చాలామంది నోళ్ళలో మెలగాలి. ఎంతమంది బరువునైనా సులభంగా మోయాలి' అని అనుకొని ఉంటుందేమో!

బస్సు కూడా అప్పుడప్పుడు మెచ్చుకుంటుంది. ఒక్కొక్కప్పుడు నాకే ఎదురు తిరిగి మాట వినదంటుంది. ఇక కదలను అని మొండికేస్తుంది. అప్పుడు నాకు ఎక్కడలేని కోపం వస్తుంది, ప్రాణం లేని బస్సుకూడా నన్ను ఇంత చులకనగా చూస్తున్నది కదా అని. ఐనా, ఆ కోపాన్ని దిగమింగు కుంటాను. శంకరాచార్యులు కాలేకాళే సీసమే త్రావగా, ఇకనేను ఈ కోపాన్ని టీ మాదిరిగా తాగి పారవేయలేనా?........

ఉదయమెందుకవుతుంది? రాత్రి ఇలాగే గడవరాదూ? పగలు తక్కువ ఉండి, రాత్రి ఎక్కువ ఉండకూడదూ? చెక్కలను ఎంచుకుంటూ (వెన్నెల లేనప్పుడు) దోమలను తిట్టుకుంటూ, నల్లులను చంపుతూ కుక్కిమంచంమీద వెల్లకిలా పడుకుని ఏవేవో ఆలోచనలు చుట్టుముట్టగా, అలా అలా జాగ్రదవస్థనుంచి స్వప్నం

ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక

# దీపావళి కథల పోటీ

## 2,000 రూపాయల బహుమతులు

ప్రతి ఏడాదివలెనే క్రోధిలోకూడ దీపావళి సందర్భంలో ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక కథల పోటీ నిర్వహిస్తున్నది.

శోభకృతులో 1,500 రూపాయల బహుమతులు ఇచ్చాము. ఇతోధికమైన ప్రోత్సాహం ఇచ్చే నిమిత్తం ఈ ఏడాది 2.000 రూపాయల బహుమతులు ఇవ్వడానికి నిశ్చయించాము.

తెలుగు రచయితలు ఈ అవకాశం వినియోగించుకొని, పాఠకులకు ఉత్తమమైన కథలు సమర్పించాలనే మా పూనిక విజయవంతంగా నెరవేరడానికి తోడ్పడాలని అర్థిస్తున్నాము.

**మొదటి బహుమతి 850 :: రెండవ బహుమతి 500**

**మూడవ బహుమతి 350**

**రెండు కన్సొలేషన్ బహుమతులు : చెరొక 150**

**దీపావళి కథల పోటీ నిబంధనలు :**

1. ఇతివృత్తం ఆంధ్రుల జీవితానికి సంబంధించినదై ఉండాలి.
2. స్వీయరచనలే కాని అనువాదాలు పంపరాదు.
3. రచన పావుతావు సైజులో 12 పేజీలకు మించరాదు.
4. సిరాతో కాగితానికి ఒకప్రక్కనే వ్రాయాలి.
5. బహుమతి పొందని కథలలో యోగ్యమైనవి ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రికలో ప్రచురించే హక్కు మాకు ఉన్నది.
6. పోటీకి రచన పంపేటప్పుడు కవరు మీద 'దీపావళి కథల పోటీకి' అని స్పష్టంగా వ్రాయాలి.
7. బహుమతి పొందని కథలలో ప్రచురణార్హం కానివి తిప్పి పంపే నిమిత్తం తగుమాత్రం తపాలాబిళ్ళలు అంటించిన, చిరునామా కలిగిన కవరు జతపరిచి పంపవలసి ఉన్నది. లేకపోతే వాటిని తిప్పి పంపడం జరుగదు.
8. రచనలు 'ఎడిటర్, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, ఎక్స్‌ప్రెస్ ఎస్టేట్స్, మద్రాసు—2'కు పంపాలి.

**బహుమతి పొందిన కథలను ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక దీపావళి ప్రత్యేక సంచికలో ప్రచురించగలము**

| | |
|---|---|
| దీపావళి కథల పోటీకి రచనలు మాకు చేరవలసిన ఆఖరి తేది | **1964 అక్టోబరు 3** |

# ఒకటీ – రెండూల మధ్య

లోకి, స్వప్నం నుంచి సుషుప్తిలోకి వెళ్ళటంలో ఎంత హాయి ఉంటుంది? హాయి ఉంటుందా అని ఒక్కోసారి అనుమానం. బస్సులలో పడుకోవడమే ఎక్కువ. దాంట్లో విపరీతంగా నల్లులతో ఆడుకుంటాను.

"హాయి ఉంటుంది. ఉంటుంది" అని అంటుంది మనసు. "పందెం కాయి" అని అంటాను. "సై" అంటుంది.అది ఎప్పుడో గెల్చిఉంటుంది. ఎందుకంటే తెల్లవారగానే లేవబుద్ధి కాదు. అప్పుడు జ్ఞప్తికి వస్తుంది–రాత్రి నేనూ,మనసూ పందెం కాశామనీ,పందెంలో మనసే గెలిచిందనీను. నాలుగుగంటలు కొట్టగానేలేస్తాను.ఐదు గంటలకు వెళ్లే డ్యూటీ ఉన్న రోజుల్లో మాత్రమే అలా లేస్తాను. ఈరోజు ఈ ఊరైతే, మరోరోజు మరో ఊరు; మరో హాల్టింగ్. ప్రతి రోజూ ఏదో ఊరిలో మాత్రం హాల్టింగ్ జరుగుతుంది. మెయిన్ బస్ డిపోలో ఎక్కువ హాల్టింగులు జరుగుతూ ఉంటాయి. ఈ హాల్టింగుల్లో చివరి హాల్టింగు ఎక్కడో?

లేవగానే ఒక చార్‌మినార్‌ను ముట్టిస్తాను. బద్ధకమంతా మాయమవుతుంది. మొహం కడుక్కోగానే ఎక్కడైనా దాక్కున్న నిద్రమబ్బులో కొంచెం భాగం ప్రియుణ్ణి వీడలేక వెళ్ళిపోతున్న ప్రేయసిలా నిష్క్రమిస్తుంది. అప్పుడు చిన్నగా నవ్వుకుంటాను. నిట్టూర్పు కూడా విడుస్తాను. అయిదు గంటలకు కాంటీన్‌లో టీ కాస్తూ ఉంటుంది ముక్కుతూ, మూలుగుతూ సలీమా. సలీమా వయసు చెప్పాలా? సుమారు నలభై అయిదుకు అటో ఇటో. తార్రోడ్డుతో స్నేహం చేస్తుంది ఆమె ఒంటి రంగు. టీ మాత్రం ఫస్టుగా చేస్తుంది.

కండక్టరు భాయీ, నేనూ టీ తాగి స్థిమితంగా మరోసారి హైదరాబాదు నవాబుగారి పుణ్యమా అని మసిద్ మార్కు సిగరెట్లను (చార్‌మినార్) ముట్టిస్తాము. పొగల మేఘాలను సృష్టిస్తాం.

ప్రయాణికులు హడావిడిగా వస్తారు. కొందరు నిద్రమత్తుతోనే వస్తారు. కొందరు స్నానాదికాలు ముగించుకుని నీటుగా వస్తారు. నేను మాత్రం సాయంత్రమే చేస్తాను స్నానం. నాకు తైమెక్కడుంటుంది? ఉన్న మధ్యాహ్నపు రెస్టు టవునులో తిరగడానికే సరిపోతుంది. ఆదివారం మాత్రం ఒక పూట డ్యూటీ ఉంటుంది. "పెళ్ళి కానీ. ఈవిధంగా ఉంటావేమో చూస్తాను" అంటుంది అమ్మ. ఒకరోజు సీట్లు భర్తీ అవుతాయి. మరోరోజు ఖాళీగా ఉంటుంది. వెన్నెల, చీకటి మాదిరిగా.

కొందరు ఉత్సాహంతో ఉరుకుతూవస్తారు.

**సాధారణంగా మనుషుల జీవితాలలో చాలా సామాన్యమైన సంఘటనలు మాత్రమే జరుగుతూ ఉంటాయి. అతి సామాన్యమైన ఆది, అంతే సామాన్యమైన అంతం. ఈ ఆద్యంతాల మధ్య పరిభ్రమించే సామాన్యమైన జీవితాన్ని అనుభవించడం మాత్రం సామాన్యమైనదేమీ కాదు.**

డబడబా వాగుతుంటారు. కొందరు మౌనంగా సమాధిలో మునిగి ఉంటారు.

టిక్కెట్లు ఇవ్వడం అయిన తర్వాత సగర్వంగా నావైపు చూస్తూ 'టన్—టన్' మనిపిస్తాడు కండక్టరు... 'కదులు— కదులు. ఇంకా కదలవేం?' అని దాని అర్థం. బస్సు కూడా నిద్రనుంచి మూలుగుతూ లేస్తుంది. నన్ను తిట్టుకుంటూ ముందుకు కదులుతుంది. పిచ్చిగా దుమ్ము రేపుకుంటూ పరుగెత్తుతుంది. దాని కోపం చూసి నవ్వుకుంటాను.

ఇంట్లో నెలబత్తెం సరిగా లేనప్పుడు అమ్మ కోపగిస్తుంది. తిడుతుంది. ఊరికే ఖర్చు చేస్తానని బాధ పడుతుంది. ఆరోజు భోజనం చేయకుండా కోపంతో బయటికి వస్తాను. బయటనే భోజనం చేస్తాను. అయినా అంత కోపంలోనూ అమ్మ నవ్వుకుంటుంది (ఆట!) ఎందుకో? అదీ నే వెళ్ళింతర్వాతట.

"అన్నయ్యా! నాకీరోజు మంచి లంగా పట్టా వాలి" అని కోరుతుంది నా చిన్ని చెల్లాయి. సరే అంటాను. కానీ, ఏదో ధ్యాసలో మరుస్తాను. అందుకని ఆరోజు చెల్లాయికూడా బుంగమూతి పెట్టి భోజనం చేయకుండా కూర్చుంటుంది.

'టన్.' ఆగు.

ఆపాను.

జీవితంలో ఎన్ని సార్లు ఆగాలో? ఎన్నిసార్లు కదలాలో? ఆగడం, కదలడం—మా ఇద్దరికీ అదీ ఒక పని. మూగ స్నేహితునితో నేను, నాతో మూగ స్నేహితుడు చెట్టాపట్టాలు. అందులోనే ఆనందం కనిపిస్తుంది. మూగమాటలతో వేసరిక వేస్తుంది. ఐనా మాపని మేము చేయవలసిందే. చలి పుడుతున్నా, వానపడుతున్నా, గాలి బర్రున వీస్తున్నా, ఎండ తీవ్రంగా ఉన్నా, చేతులు నొప్పులు పెడుతున్నా బస్సు నడవ వలసిందే. ఎవరి కొరకు? 'నా కొరకు. నావాళ్ళ కొరకు' అని వినిపిస్తుంది లోన.

మొదటి స్టేజీలో ఎవరూ ఎక్కరు. ఎవరూ దిగరు. శనివారంపూట మాత్రం ప్రతి స్టేజీ నుంచి బాగానే జనం ఎక్కడం, దిగడం జరుగుతాయి. రోగిష్ఠులూ, దెబ్బలు తగిలినవాళ్ళూ, ఆరోగ్యవంతులూ, వృద్ధులూ, బాలురూ అందరూ ఎక్కుతారు. అందరూ తమ తమ గమ్యాలకు వెళతారు.

మొదల్‌కల్ అనే ఊరుంది. అది మిడిల్ స్టేజి అయిజకు. ఆ రూటుకు రెండు కాంటీన్లు ఉన్నాయి. ఆ ఊళ్లో శనివారం సంత జరుగుతుంది. ఐదు గంటల బస్సుకే వెళ్ళుదామనితొక్కిడిగా వస్తారు. అంతో, ఇంతో నాకూ, కండక్టరుకూ ఆరోజు చేతిలో పడుతుంది. ఆ విషయం మేము చెప్పరాదు కూడా. అయినా, ఈరోజుల్లో ప్రభుత్వాన్ని దోచనిదెవరు? ప్రభుత్వాన్ని మోసగించని దెవరు? ఒక విధంగా ప్రభుత్వాన్ని ప్రభుత్వమే మోసగించుకుంటున్నది. అది ఎలా అని అడిగితే మాత్రం నాకు చెప్పడానికి రాదు. అంత బుద్ధికూడా లేదు.

ఏది ఏమైనా నా ఆత్మను నేను మోసం చేసుకుంటున్నాను. ఇప్పుడు దేశ పరిస్థితి ఎలాఉంది? చైనీయుల నమ్మక ద్రోహం ఎలాఉంది? వారి బాధ ప్రతి భారతీయుని హృదయంలో ఎలా ఉంది? అన్న విషయాలు తెలుసుకుని కూడా ఈ డబ్బుపై వ్యామోహాన్ని ఎందుకు తొలగించుకోలేకున్నాను? ఛీ!నా జన్మ వ్యర్థమైంది. నాజన్మ శత్రువులకు కూడా వద్దు.

ఎక్కడ హఠాత్తుగా ఇన్‌స్పెక్టర్ వస్తాడో (చెకింగ్ మాస్టర్) అని కండక్టరుకు దిగులే. ఐనా, మొదటే ఇన్‌ఫర్‌మేషన్ తెలుసుకుని ఉంటాము కాబట్టి అంత భయముండదు. దీనిలో తప్పేముంది? తప్పును ఒప్పుకోవడంలో కూడా పాపముందా? అసలు పెద్ద చేపలు మమ్మల్ని కూడా మింగుతాయి. అప్పుడు మేము వాటికి ఎరలుగా మారుతాం. అప్పుడు మాకు కోపం వస్తుంది. దుఃఖం కూడా వస్తుంది. లగేజీలవి నావంతు. మిగతావి అతడివి. ఇలాపంచుకుంటాము. ఇలా చెబుతున్నానని నాపై కోపగిస్తారా? ఉన్న విషయం చెబితే ఉలుకెందుకు?

ఇద్దరు ముగ్గురు కండక్టరు భాయీలు నా కళ్ళ ఎదుటే పట్టుబడి ఎంత కాళ్ళా వేళ్ళా పడ్డప్పటికీ (అంటే పెద్ద చేపలకు ఎర చూపినప్పటికీ) సస్పెండు అయినారు. మరి దీనిలో ఎవరిది న్యాయం? మనదేనా న్యాయం? కాదు. అది మనకు తెలుసు. తెలిసినప్పటికీ అన్యాయం చేస్తూనే ఉంటాము. ఎందుకో? వ్యాపారస్థులకు ఇటువంటి విషయాలలో బాగా అనుభవముంటుంది. ఒక సంచి బియ్యంలో శేరు ఇసుక, శేరు నూక (పాత కొలతలు) కలుపుతారట. కొబ్బరినూనెలో ఏదో నూనె కలుపుతారట. ఈవిధంగా ప్రతి దానిలోనూ ఏదో ఒకటి చేస్తూఉంటారట. అది వాళ్ళకు న్యాయమే అనిపిస్తుంది. ఏవృత్తిలోనైనా ఈ అన్యాయాలు జరుగుతూనే ఉన్నవి.

సీట్లకొరకు కొట్లాడుతారు. తలుపులు గుద్దుతారు. తమకు ఏదో అర్జంటు పనులున్నాయనీ, బస్సులో ఎక్కించుకోమనీ కాళ్ళా వేళ్ళా పడతారు. అప్పటికే రద్దీ ఎక్కువై ఉంటుంది. ఒకరి ఊపిరి ఒకరు పీలుస్తుంటారు. హుష్! అబ్బా! వాయబ్బా! యమబాధ! శివశివా! హరిహరీ! అని ఏమేమో పలుకుతుంటారు.

అంత రద్దీలోనూ ఎవడో ఒక మహాను భావుడు రెండు మూడుఉంగరాలు, తెల్లటి లాల్చీ, ధోవతి కట్టి "ఏయ్! నా సీటు పట్టుకో" అని చెప్పి పోయుంటాడు; టీ తాగటానికో, మరెక్కడికో. బస్సు కదిలేటప్పుడు ఉరుక్కుంటూ వస్తాడు. "ఏమయ్యా, కొంచెంకూడా ఇది లేదూ? సీటు రిజర్వు చేసుకు పోయానే. టిక్కెట్టు కొనుక్కున్నానే. ఇటువంటి నన్నే విడిచి పోతున్నారే?" అని గదమాయిస్తాడు కండక్టరును. "సరే లేవయ్యా! ఎక్కు ఎక్కు. టైమ్ మీరిపోతుంది" అని అంటాడు కండక్టరు. లాల్చీ వ్యక్తి లోపలికి వెళ్ళిచూస్తే తన సీటులో ఎవరో ఒకడు కూర్చుని ఉంటాడు. ఎవరైనా మోటు మనిషైతే గదమాయిస్తాడు, "లేవరా" అని. కొంచెం పాంటు, బుష్‌షర్టు వేసుకుని ఆ ఇరకాటంలో కూర్చునికూడా ఏదో ఒక ఇంగ్లీషు పుస్తకాన్ని చదువుతున్నట్లు నటిస్తున్న వాణ్ణి చూసి ఏమీ అనకుండా తానే నిలబడతాడు. ఎందుకో? అంతవరకున్న గర్వ ఎక్కడికి పోతుందో?

'టన్ టన్.' బస్సు కదులుతుంది. ఆటోమేటిక్‌గా నా చేతులు బస్సును మెలికలు తిప్పుతూ నడిపిస్తుంటాయి. నడుమ నడుమ బస్సుకు ఎదురుగా మనుష్యులూ, కార్లూ, బండ్లూ వస్తూంటాయి. గొర్రెల మందలు, పశువులుకూడా వస్తూంటాయి. అప్పుడు వాటిని తప్పుకోవడానికి కొద్ది ఆలస్యమౌతుంది. ఒకసారి ఎవరో ఒక లారీడ్రైవరు ఒక పిల్లవాణ్ణి క్రష్‌చేసి వెళ్ళిపోయాడట. ఆ నేరం మరొక డ్రైవరుపైకి వచ్చింది. ఇలాటివి ఎన్నో జరుగుతాయి.

బస్సు కొంచెం ఆలస్యమైతే, ఎందరు తిట్టుకుంటారు? ఎంతోమంది ఎన్నో స్టేజీలలో ప్రేయసి వస్తానని చెప్పి రాకున్నప్పుడు ఎదురు చూసే విధంగా, తహతహ పడుతుంటారు. ఈ సామ్యం సరిపోదూ? ఆలస్యంగా స్టేజీలను చేరేవాళ్ళు బస్సు ఆలస్యంగానే రావాలని మనసులో భగవంతుని ప్రార్థించుకుంటూ వస్తారు. నేనుకూడా ప్రార్థిస్తూ ఉంటాను, "హే భగవాన్! నా జీవితంలో ఒక్కసారైనా లక్షాధికారి అని అనిపించుకోవాలని నా తహ తహ. అది పూర్తిచేయి. అంతేకాదు నా బంధువులు, స్నేహితులు నన్ను మెచ్చుకునేట్లు చేయి. అమ్మనూ, చెల్లాయినీ సుఖంగా ఉంచాలి. వారి మనస్సులు ఏమీ బాధపడకూడదు. ఇదీ నా కోరిక. పూర్తి చేస్తావా? చేయి. లేదా ఇక నా కర్మ" అని.

మొదల్ కల్లు వెళ్లుతుంది. ఆ వెంకటేశునికి

**సి. నాగేశ్వరరావు**

# విచిత్ర వాస్తవికతలు

## గుండెజబ్బుకు కారణాలు

**సంపన్న దేశాలలోనే** గుండెజబ్బులు ఎక్కువగా వస్తున్నాయి. తినేతిండిలో కొవ్వుపదార్థం ఎక్కువగా ఉంటే ఈ జబ్బులు వస్తాయని వైద్య శాస్త్రజ్ఞులు చెబుతున్నారు. వ్యవసాయం ప్రధాన వృత్తిగా గల ఫిన్లెండ్ దేశంలో ప్రజలు వెన్న ఎక్కువగా తింటారు. ఆ దేశంలో అమెరికాలో కంటే కొలెస్ట్రరల్ వ్యాధులు, గుండె జబ్బులు ఎక్కువగా ఉన్నట్లు తేలింది. మధ్యధరా ప్రాంతంలోని మరొక దేశం విషయంలో కూడా ఇదే పరిస్థితి కనబడింది. కొవ్వు పదార్థాలు తక్కువగా వాడే దేశాలలో గుండె జబ్బులు కూడా తక్కువే.

మినెసోటా యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ ఏన్సెల్‌కీస్ ఈ పరిశీలన జరిపారు. ఈయన ఇప్పటికి తెలుసుకొన్నదానిని బట్టి కొవ్వు పదార్థాలు విపరీతంగా తినవద్దని సలహా ఇస్తున్నారు.

ఈ పరిశీలనలు రెండు రకాలుగా జరుపుతున్నారు. కొన్ని ప్రత్యేక రకాల ఆహారం కొందరిచేత కొన్నాళ్లు తినిపించి అందువల్ల కనపడే ఫలితాలను పరిశీలించటం ఒక పద్ధతి. ఆయా ప్రదేశాలలో ప్రజలు అలవాటుగా తినే ఆహారాల వల్ల అక్కడ ఉంటున్న పరిస్థితులను పరిశీలించటం మరొక పద్ధతి. ప్రజలు కూడా ఇందుకు బాగా సహకరిస్తున్నారు. ఒక ప్రదేశంలో 300 కుటుంబాల వారు ఈ పరిశీలకులు చెప్పిన రీతి ఆహారమే తినటానికి అంగీకరించారు.

## చవులూరించే చేప వంటకాలు

**సముద్రాలు** ఆహారం పుష్కలంగా లభించే పెన్నిధులన్న సత్యాన్ని ఇటీవలనే లోకం గుర్తించింది. మత్స్య పరిశోధన రంగంలో అమెరికా వందలాది పథకాలను అమలు జరుపుతున్నది. చేపల మాంసకృత్తులతో రకరకాల తినుబండారాలు తయారు చేసి పంపిణీ చేయటానికి ఒక పథకం తలపెట్టారు.

చేపలోని అన్ని భాగాలను కలిపి పొడిచేస్తే అది మంచి ఆహారంగా ఉపయోగిస్తుంది. అమెరికా చుట్టూ ఉన్న సముద్రాలలో చేపలన్నిటినీ పట్టి, ఈ పదార్థం తయారు చేసినట్లయితే—నూరు కోట్ల మందికి దాదాపు సంవత్సరం పాటు సరిపోయే ఆహారం లభిస్తుంది.

చేపలు త్వరగా చెడిపోవటం వల్ల, తగు రవాణా సౌకర్యాలు లేకపోవడం వల్ల చేపలను పెద్ద ఎత్తున పంపిణీ చేయటానికి సాధ్యం కాకుండా ఉన్నది. ఈ విధమైన చేపల పొడి తయారుచేయటంతో ఈ సమస్య తీరిపోతుంది. ఈ పొడిని వేరువేరు సైజులలో పొట్లాలు కట్టి తేలికగా ఎగుమతి చేయవచ్చు. ఇది బలవర్ధకమైన ఆహారం. అన్ని రుచులవారికీ నచ్చేలాగా తయారు చేయవచ్చు.

ఈ పదార్థాన్ని అనేక పద్ధతుల్లో అనేక రూపాల్లో తయారు చేయవచ్చు. కమ్మని పొడిగానూ, చవులూరించే గుజ్జు ( సాస్ ) గానూ చేయవచ్చు.

ఈ పథకం పూర్తిగా జయప్రదమైననాడు ప్రపంచ జనాభాలో నూటికి 80 మందికి బలవర్ధక ఆహారపు లోపాన్ని తీర్చగలుగుతాము.

## చౌకగా విద్యుచ్ఛక్తి ఉత్పత్తి

**అమెరికా** రసాయన శాస్త్రవేత్త ఒకరు విద్యుచ్ఛక్తి చౌకలో తయారుచేసే సులభ సూత్రం కనుగొన్నారు. ఆయన మిల్వాకీలోని ఏలిస్—షామర్స్ మాన్యుఫాక్చరింగ్ కంపెనీకి చెందిన డాక్టర్ రేమండ్ జె. జెసిన్‌స్కీ. ఆయన సూత్రం ప్రకారం ఉదజని, ఆమ్లజనులలోని రసాయనిక శక్తిని సరాసరి విద్యుచ్ఛక్తిగా మార్చవచ్చు. ఖరీదైన ప్లాటినమ్‌కు బదులు చౌకగా దొరికే నికెల్ బొరైడ్ అనే మిశ్రమాన్ని ఇందులో ఉపయోగిస్తారు. విద్యుచ్ఛక్తి త్వరగా జనించేటట్లు చేయటానికి ఈ మిశ్రమం కావాలి. ఈ విద్యుచ్ఛక్తి కృత్రిమ ఉపగ్రహాలకూ, వ్యోమ నౌకలకూ, ఆటోమేటిక్ వాతావరణ కేంద్రాలకూ ఉపయోగపడుతుంది.

ఈ విద్యుచ్ఛక్తి ఉత్పత్తికి ఉపయోగించే ఇంధనం ప్లుటోనియం కంటే 15 రెట్లు చౌకగా లభిస్తుందని డాక్టర్ యూజిన్‌స్కీ అనే అమెరికా శాస్త్రవేత్త తెలిపారు.

ఇంధన పేటికలో కదిలే భాగాలేవీ ఉండవు. ఇది కుదిమట్టంగా, తేలికగా, మన్నికగా ఉంటుంది. ఉపగ్రహాలకు ఇటువంటి విద్యుచ్ఛక్తి సరఫరా సాధనం ఒకటి ఉంటే బావుండునని అమెరికా శాస్త్రవేత్తలు చాలాకాలంగా కలలుగంటున్నారు. ఆ కలలు ఇప్పుడు ఫలించినట్లే. రోదసిలో ఉండే రేడియేషన్ దీనినేమీ చేయజాలదు. ✱

# ఒకటీ – రెండూల మధ్య

నమస్కరించుకుంటాను. అయిజ వెళ్లుతుంది. అక్కడ టీతాగుతాము. ఉప్పలకాంపు వెళ్లుతుంది. వడ్డేపల్లి వస్తుంది. మరోసారి అనంతమ్మ హోటల్లో టీతాగుతాము. కలుకుంట్ల, అలంపూరు, టర్నింగూ అన్నీ దాటిపోతాయి. ఇదే విధంగా జీవితంలో కష్టాలు దాటిపోరాదూ? ఊహుఁ. అవి కదలవేమిటి?

నాన్న పోయాడు. చదువాగింది. ఇంటి భారం మోయాలిగా? నా మనసులో ఎన్నో షేక్ చిల్లీ కోరికలు ఉండేవి. ఎం. బి. బి. ఎస్. పాస్ కావాలనుకున్నాను. డాక్టరయి ప్రజలకు ఎంతో సేవ చేయాలనుకున్నాను. ( ఇందులో స్వార్థం కూడా లేకపోలేదు ). కానీ 'టన్' మన్న శబ్దమైంది. తాడువట్టి కండక్టరు ( బ్రహ్మ ) లాగాడు, ముందరికి పోవాకని. బలవంతంగా ఆగాను. 'టన్ టన్ ' మని వినిపించదా అని ఎదురు చూస్తున్నాను. నా కోరిక పూర్తి కావడం ఎప్పుడో?......

బస్సుడిపో కర్నూలు వస్తుంది. అక్కడి నుంచి మళ్ళీ ఏదో ఒక రూటుకువేస్తారు. మళ్ళీ ఆ రూటుకు వెళ్ళాలి. నిజ జీవితంలో ఎన్నో బాటలు మార్పు చేయవలసి ఉంటుంది. మన ఇష్టాయిష్టాలతో పని ఉండదు. అంతా పైవాళ్ళ ఇష్టమే. వారిచ్చే హుకుముల ప్రకారమే మనం చేయవలసి ఉంటుంది.

రాత్రీ, పగలూ, వెన్నెలా, చీకటీ వస్తూ పోతుంటాయి. కాలచక్రం బస్సుటైరు మాదిరిగా తిరుగుతూనే ఉంటుంది. ఏమిటో ఈ జీవితం? ఎందుకో ఈ జీవితం?— అని ఒక్కోసారి నిస్పృహ. కానీ, వివేకానందుని, శివానందుని, శ్రద్ధానందుని తలుచుకోగానే అది ఎక్కడికో పారి పోతుంది. పత్తా తెలియదు.

ఎక్కడలేని ధైర్యం వెదుక్కుంటూ వస్తుంది. వాకిలి తెరుస్తాను. లోపలికి పిలుస్తాను.

చైనాను నేనొక్కణ్ణే ఓడించగలను అని రొమ్ము విరుచుకుంటాను. ఉత్సాహం ఉబుకుతుంది.

ఇది నా దేశం.

ఇది నా బస్సు.

ఇది నా జీవితం.

ఇదీ నా ఒకటీ— రెండూల మధ్య పోరాటం. పొత్తు కుదరని మాటలు. పిచ్చివాడి పలుకులు ఇవి.

'టన్.' సడన్‌గా ఆగుతాను.

'టన్ టన్.' చేతులు తిప్పబోతాను. కానీ అవి గడియారపు గంటలు. ★